భట్టిప్రోలు నాగసుందరం స్మారక సంక్రాంతి కథల పోటీలో తృతీయ బహుమతి పొందినది

# సీత ప్రతీకారం

చింతా రోహిణి

**సీత** ఏడ్చుకుంటూ ఇంటికి వచ్చింది. అయిదో క్లాసులో చదివే ఆ ఆకెళ్ళాడు సీత జుట్టుపీకి, బట్టలు చింపి, సీతని మట్టిలో కూడా దొర్లించి పంపించాడు. పాపం మట్టి దులుపుకుంటూ, చిరిగిన బట్టలు చూసి వెక్కి వెక్కి ఏడ్చుకుంటూ సీత ఇంటికి వచ్చేసరికి ప్రకాశం సీతకోసం వాళ్ళరుగుమీద కూర్చుని ఎదురుచూస్తూ కనిపించాడు. ప్రకాశాన్ని చూస్తూనే సీతకీ అప్పటిదాకా అణుచుకున్న దుఃఖం పొంగుకొచ్చింది. "చూడు ప్రకాశం! ఆ నల్లిగాడు వాళ్ళ తోటలో ఆడుకుందాం రమ్మని నన్ను కొట్టాడు. కళావతి, పద్మా, శీనుగాడు పారిపోయారు. ఈ లంగా కొత్తది తెలుసా! మొన్ననే అమ్మ రాజమండ్రినుంచి తెచ్చింది. ఇప్పుడు ఇది చిరిగిపోయిందని తెలిస్తే చంపేస్తుంది" అంటూ భోరున ఏడవసాగింది.

సీత చింపిరిజుట్టూ, చిరిగిన బట్టలూ, మట్టిమొహం చూసి పాపం ప్రకాశానికి జాలేసింది. "మరి నేను లేకుండా వాడితో ఆడొద్దన్నానా! ఎందుకెళ్ళావు?" అనడిగాడు సీత మొహం తుడుస్తూ.

"నువ్వు మీ దొడ్డమ్మగారింటికి వెళ్ళావని మీ అమ్మ పొద్దున్న నేనొచ్చినప్పుడు చెప్పింది" అంది సీత.

"అవును. ఇదిగో అక్కణ్ణించి నీకిష్టమని జీళ్ళు తెచ్చాను. ఇందు" అన్నాడు పొట్లం అందిస్తూ. సీత ఓ జీడి నాకి బావుంద న్నట్టుగా తలూపి, కొంచెం ఏడుపాపి "మా నాన్నతో ఆ నల్లిగాడి పని చెప్పనా?" అనడిగింది.

ప్రకాశం "వద్దులే. చెప్తే మొన్నట్లాగ గొడవవుతుంది. అయినా వాడి అమ్మ మనల్నే తిడుతుంది. అందుకే వాడికింత పొగరు. ఈ సంగతి నే చూసుకుంటాలే" అంటూ సీతని లోపలికి తీసుకెళ్ళాడు. "మరి ఈ లంగా?" అంది సీత. ప్రకాశం "నేనున్నాగా" అంటూ, సీతా వాళ్ళమ్మతో "పాపం సీతని కరణంగారి ఆబోతు పొలం నుంచి వెళ్తుంటే తరిమిందండీ. వాళ్ళ పాలేళ్ళు వచ్చేంతలో ఇంతపని జరిగింది. దెబ్బలేం తగల్లేదులెండి. సీత లంగా నాకివ్వండి. మా అమ్మ ఇట్టే బాగుచేసి కొత్తదానిలా చేసేస్తుంది" అన్నాడు.

సీతావాళ్ళమ్మ కంగారుపడి, సీత ఒళ్ళంతా తడిమిచూసి "పోనీలే! పెద్ద గండం గడిచింది" అంటూ సీత మొహం శుభ్రంగా కడిగి, బట్ట మార్చి, జడేసి, ఇద్దరికీ తలో అరిశా పెడుతూ, ప్రకాశంతో "నేనే మీ ఇంటికి వస్తాలేరా! పండక్కి రవికెలు కూడా కుట్టించాలి. రేపు మద్దినేళ వస్తానని మీ అమ్మతో చెప్పు" అంది. ప్రకాశం అరిశ తినేసి "సీతా! నే చూసుకుంటాలే" అంటూ వెళ్ళిపోయాడు. సీత జీళ్ళు నాకుతూ, భోయినం వేళయ్యేదాకా వీధిలో వచ్చేపోయేవాళ్ళను పలకరిస్తూ కాలం గడిపింది.

మర్నాడు సీతావాళ్ళమ్మ ప్రకాశం వాళ్ళింటికి వెళ్తుంటే, తనూ వెంట వెళ్ళింది. అప్పుడేమో ప్రకాశం తనూ కలిసి వాళ్ళమ్మలకి వినిపించకుండా దూరంగా వసారాలో కూచునీ, ఆకెళ్ళాడిని దెబ్బతియ్యడానికి గూడుపుఠాణీ మొదలెట్టారు.

"బళ్ళో మాష్టారు చేత కొట్టిద్దామా?" అంది సీత. "ఊహూ! చీనుగారి కుక్కతో కరిపిద్దామా?" మళ్ళీ అడిగింది సీత.

"చాల్లే! వాళ్ళమ్మకి తెలిస్తే కుక్కతోలూ, మనతోలూ కూడా వొలిచేస్తుంది" అన్నాడు ప్రకాశం. "మరెలా...?" చాలాసేపు ఆలోచించీ, ఆలోచించీ ప్రకాశం "కరణంగారి ఆబోతును రెచ్చగొట్టి, దానిచేత బెదరగొట్టిద్దాం" అన్నాడు. "అమ్మో! పాలేళ్ళు రాకపోతేనో" అంది సీత భయపడుతూ.

"మనం గట్టిగా అరుద్దాం. అప్పుడు వెంటనే వచ్చేస్తారు" అన్నాడు ప్రకాశం. సీత అప్పుడే ముందు జరగబోయేది ఊహించుకుంటూ "అప్పుడు వాడి మొహాన్నకూడా మట్టీ, పేడా పడతాయి. అబ్బా! నువ్వెంత తెలివైనవాడివో ప్రకాశం!" అంటూ సంతోషంతో గంతులేసింది. ప్రకాశం తన తెలివితేటలకి తనే మురిసిపోయాడు.

మర్నాడు వాళ్ళ బుల్లి కుట్ర ప్రకారం ఆకెళ్ళాడిచేత ఎఱ్ఱచొక్కా వేయించి (ఎరుపుచూస్తే ఆబోతు రెచ్చిపోతుంది కదా!......అందుకనీ!) పొలానికి తీసుకెళ్ళారు. కానీ ఎంతసేపు నడిచినా, ఎక్కడ వెతికినా ఆ ఆబోతు కనిపించదే.......! పొలం గట్లమ్మట నడిచీ, నడిచీ సీతకి కాళ్ళరిగీ ......... నీరసంకూడా వచ్చేస్తోంది. కానీ ఆబోతు జాడ లేదు. "ప్రకాశం! పాలేళ్ళు దాన్ని కట్టేశారేమో" అంది సీత నిరుత్సాహంగా.

"దేన్ని కట్టేశారు?" అనడిగాడు ఆకెళ్ళాడు రాళ్ళేరుకుంటూ!

సీతకీ భయం వేసింది. వాడికి విషయం తెలిస్తే..... ఆ రాళ్ళతో కొట్టి చంపేస్తాడు. వాళ్ళమ్మ మిగిలిన వాళ్ళందర్నీ చంపేస్తుంది. అప్పుడు వాళ్ళమ్మా, వాడూ తప్ప ఊళ్ళో ఎవరూ మిగలరు. ఇంక వాళ్ళమ్మ అరుపులకి వాడూ చచ్చిపోతాడు.

"ఏయ్! దేన్ని కట్టేశారు?" అని రెట్టించాడు ఆకెళ్ళాడు. "పాదులకీ పందిళ్ళు" అన్నాడు ప్రకాశం. "ఏరా! ఇక్కడ పాదులేవీ?" అంటూ ఆకెళ్ళాడు ప్రకాశం చొక్కా పట్టుకునేసరికి, ఇద్దరికీ భయం వేసి, వాణ్ణి ఒక్కతోపు తోసి పరిగెత్తడం మొదలెట్టారు. ఆకెళ్ళాడేమో వీళ్ళవెంట పరిగెడుతూ, రాళ్ళు విసురుతుంటే, ఆ రాళ్ళల్లో ఒకటి కొబ్బరిచెట్టు మొదట్లో పడుకున్న పాముకి తగిలి, అది తలెత్తి చూసింది.

ఆకెళ్ళాడు అదిచూసి భయపడి "ఒరేయ్! ప్రకాశం ఆగరా! నేను పాముని కొట్టాను" అంటూ 'దేన్ని కట్టేశారు' సంగతి మర్చిపోయి వాళ్ళవెంట పరిగెత్తాడు.

ఇంటికి చేరాక ప్రకాశం, సీతా, ఆకెళ్ళాడి అమ్మతో "మీ అబ్బాయి పామును రాయిచ్చుకొట్టాడండీ. అది తలెత్తి వీణ్ణి చూసేసిందండీ" అని చెప్పారు.

దాంతో అరుగుమీద కూచునీ లబోదిబోమంటూ ఏడుపు మొదలెట్టింది. ఊళ్ళో అందరూ పోగయ్యారు. పాము పగబడితే ఇంక అంతే సంగతులనీ, ఎలా అయినా ఈ రాత్రికే వచ్చి కాటేస్తుందనీ......... ఇలా ఎవరికి తోచించి వారు అనసాగారు. దాంతో ఆవిడ ఆకెళ్ళాడిని చితక్కొట్టి "అందర్నీ బాధపెడితే ఇలాగే చస్తావురా" అంటూ రంకెలేసింది. సీత "ప్రకాశం! వాడు నిజంగా చచ్చిపోతాడా!" అనడిగింది కొంచెం బాధపడుతూ.

"ఏం కాదు! పిరికివెధవ. వీడిరాయి పాముకి తగలనేలేదు" అన్నాడు. "మరి ఊరికే కాసేపు భయపెడదామా" అంది సీత నవ్వుతూ. "ఊ" అంటూ ప్రకాశం కూడా చిన్నగా నవ్వి ఏమీ ఎరగనట్టు నుంచున్నాడు. "ప్రతీకార మన్నమాట" అంది సీత కనుబొమ్మలు దెగ్గర పెడుతూ.

ఇంతట్లోకి వెంకట్రావు మామయ్య "ఆ పాముల పైడితల్లికి కబురుపెట్టండిరా" అన్నాడు. సాయంకాలం అయ్యేసరికి ఆకెళ్ళాడిని వాళ్ళమ్మ పందిరిమంచం మధ్యలో కూచోబెట్టి, పాలేళ్ళని మంచం చుట్టూ కాపలాపెట్టి, కన్నాలన్నింటిలోనూ గుడ్డలు కుక్కుతూ, గుర్తొచ్చినప్పుడల్లా కొడుకుని రెండు బాదుతూ, ఏడుస్తూ కూచుంది. వాడికి దెబ్బలు పడినప్పుడల్లా సీతా, ప్రకాశం బోల్డు ఆనందపడ్డారు. అది చూడ్డంకోసం సీతావాళ్ళమ్మ తేనేసి రొట్టి పెడతానన్నా, సీత వెళ్ళకుండా అక్కడే నుంచుండిపోయింది. ఇంతట్లోకి గుమ్మిడికాయ మామ్మ వచ్చీ "అమ్మాయీ! సంపెంగ మొగ్గలవాసనొచ్చినా, మినపరొట్టి వాసనొచ్చినా, పాము వచ్చేసినట్లే" అంది. దాంతో ప్రకాశానికీ, సీతకీ మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

సీత గభగబా ఇంటికి పరిగెత్తి, మినపరొట్టి తింటానంటూ వాళ్ళమ్మని పోరి పోరి, అది తీసుకుని ప్రకాశం దగ్గరకెళ్ళింది. ప్రకాశమేమో గుప్పెడు సంపెంగమొగ్గలు పోగేశాడు. చీకట్లో ఇద్దరూ దొంగల్లా వెళ్ళి, ఆకెళ్ళాడి ఇంటి ముందు ఆ రెండూ పడేశారు.

ఇంక వాటి వాసనొచ్చినప్పుడల్లా వాళ్ళమ్మ వాణ్ణి కొడుతూ, బండబూతులు తిట్టడం మొదలెట్టింది. ఇదంతా చూసి సీతకీ, ప్రకాశానికీ వెర్రి ఆనందం వేసింది. కాసేపయ్యాక ఇద్దరూ వెళ్ళి ఆకెళ్ళాడి మంచం ఎక్కి "ఒరే! ఇంక చచ్చిపోతున్నావు కదా! ఇంకెప్పుడన్నా మమ్మల్ని కొడతావా?" అనడిగారు. "కొట్టనురా! ఒట్టు. మీతో జట్టుగా ఉంటా! ఒరే! ప్రకాశం నువ్వు చాలా తెలివైనవాడివి కదరా! పాముని దారి మళ్ళించరా" అంటూ ఏడవసాగాడు.

"సరే! మరి మా ఇద్దరికీ చెరో రూపాయి ఇస్తావా" అని బేరమాడి, డబ్బులు వసూలయ్యాక, మెల్లగా ఆకెళ్ళాడి చెవిలో "ఒరే! నువ్వసలు పాముని కొట్టలేదురా! అది ఊరికే తలెత్తింది.... వీధిలో సంపెంగ మొగ్గలున్నాయి.... ఏరుకుని, వాటిపక్కనే ఉన్న మినపరొట్టి తెచ్చుకునీ, తేనేసుకుని తినరా" అంటూ చెప్పి, గబుక్కున మంచం దిగి పారిపోయారు.

### చందాదారులకు విజ్ఞప్తి

చినుకు కవరుపైన చందా ముగింపునెలను సూచించడమైనది. దయచేసి చందా ముగిసినవారు తమ ముగింపునెలను గుర్తించి సకాలంలో చందాను పునరుద్ధరించుకోవలసినదిగా కోరుచున్నాము.

# అంతా సత్యమే చెప్తున్నాను.....

అవును
అంతా సత్యమే చెప్తున్నాను
ఇది ఎప్పుడో ఎందరో చెప్పిన సత్యమే!
తాజాగా చెప్తున్నాను - సందర్భంగా చెప్తున్నాను
ఈ బూమ్‌లు బాంబుల వంటివనీ
ఈ సెన్సెక్కులు సెన్స్‌లేనివనీ
ఈ బ్యాలెన్స్‌షీట్లు బ్యాలన్స్ తప్పినవేననీ
అన్నీ మరీచికలే అన్నదీ సత్యమే!

అధికారంలో ఉన్నవారికి
ఇచ్చినమ్మ వాయనం - పుచ్చుకొంటినమ్మ వాయనం!
'అంతా మిథ్య' అని తెలిసేనాటికి
కాళ్ళ కింద భూమీ కుంగిపోతుందనే
స్పృహ వచ్చేనాటికి
కటకటాల వెనుక ఉండటమూ సత్యమే!

కాయ్ రాజా కాయ్....... గుర్రాలరేసూ
షేర్ల ద్యూతాలూ...
ఏదైతేనేం
బడాబాబుల వైకుంఠపాళీలో
మనకి నిచ్చెనలు దొరక్కపోవటమూ సత్యమే!
'ఫోకస్' , 'ఒకే ఒక్కడు', 'మహరాజు'
......., ఇవన్నీ ఎవరో వేసిన వలలు కానే కాదు
తనంతతానే వేసుకొన్నవే!
నేల విడిచి సాము చేస్తే
'రాజే కింకరుడగు' అన్నది పరమసత్యమే!

- డా॥ ద్వా.నా.శాస్త్రి